RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 292 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 25 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# సక్కగున్న తెలంగాణలో ఉడుమ్ముల్లా సొచ్చి అవస్థలు తెస్తున్నరు..



## కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన కేసీఆర్

## అట్టహాసంగా ప్రారంభమైన కేసీఆర్ బస్సు యాత్ర

మిర్యాలగూడ – కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిప్పులు చెరిగాయి. బస్‌యాత్రలో భాగంగా బుధవారం మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ రోజు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మళ్లీ మీ దర్శనానికి రావడం జరిగింది. ఏం జరుగుతుంది ఈ రాష్ట్రంలో. నాలుగైదు నెలల కిందట ధీమాగా ఉన్న రైతు ఈ రోజు దిగాలుపడి చాలా బాధలో ఉన్నాడు. ఆ నాడు నేను నీళ్ల కోసం, నిధుల కోసం, కరెంటు కోసం, మన ప్రజల కోసం ఉద్యమిస్తే.. 15 సంవత్సరాల పోరాటం తర్వాత బ్రహ్మాండంగా మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం' అన్నారు.

**తెలంగాణ బతుకే నీళ్లపై పోరాటం..**'ఆ నాటి నుంచి ఈనాటి వరకు మన పోరాటం నీళ్లు. తెలంగాణ బతుకే నీళ్లపై పోరాటం. ఈ జిల్లాల్లో మంత్రులున్నారు. ఇరిగేషన్ మినిస్టర్ స్వయంగా ఇక్కడ ఉన్నడు. వీళు దద్దమ్మల్లా పోయి నాగార్జునసాగర్ కట్టపై కేంద్రానికి, కేఆర్ఎంబీకి అప్పగించారు. మీరంతా కళ్లారా చూశారు. మీ అందరినీ నేను ఒకటే కోరుతున్నా. 1956 నుంచి ఈ నాటి వరకు మనకు శత్రువే కాంగ్రెస్ పార్టీ. 56వ సంవత్సరంలో ఏపీలో కలిపి 58 సంవత్సరాలు అనేక రకాలుగా గోసపెట్టిందే కాంగ్రెస్ పార్టీ. మొన్న ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చింది. నోటికి మొక్కాలి అన్ని హామీలు ఇచ్చారు. 420 హామీలు ఇచ్చి.. సక్కగా ఉన్న తెలంగాణలో ఉడుముల్లా సొచ్చి మనకు అవస్థలు తెచ్చిపెడుతున్నారు. రైతుబంధు కావాలని రైతులు అడిగితే చెప్పుతోని కొడుతా అని ఒక మంత్రి మాట్లాడుతున్నడు. చెప్పులు మీకే లేవు రైతులకు కూడా ఉంటయ్, వాళ్ల చెప్పులు చాలా బందబస్తుగా ఉంటయ్ అని నేను చెప్పిన' అంటూ గుర్తు చేశారు కేసీఆర్.

**దద్దమ్మలు సాగర్‌ను కేంద్రం చేతుల్లో పెట్టారు..** 'బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో 18 పంటలకు ఏమాత్రం వెనుకాముందు కాకుండా బ్రహ్మాండంగా సాగర్ ఆయకట్టంతా నీళ్లిచ్చి బంగారు పంటలు పండించాం. ఇవాళ ఈ రోజు ఏమైంది? సాగర్‌లో నీళ్లు ఉండే.. ఇవ్వగలిగే అవకాశం ఉండే. ఈ దద్దమ్మలకు దమ్ములేక.. ప్రాజెక్టును తీసుకుపోయి కేఆర్ఎంబీ చేతులో పెట్టి పంటలన్నీ ఎండబెట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాత పంటలు ఎండినయంటే ఇదే మొదటిసారి. రైతుబంధులో ధగా.. రైతుబీమా ఉంటదో ఊడుతదో తెలియదు. బ్రహ్మాండంగా కేసీఆర్ ఉన్నన్ని రోజులు రెప్పపాటు పోని కరెంటు కటుక బంద్‌చేసినట్లే మాయమైంది. ఎక్కడికి పోయింది కరెంటు ? ఏమైంది కరెంటుకు ? వీళ్లు కొత్తగా గడ్డపారలు పట్టి తవ్వి పని చేయాల్సిన అవసరం లేకున్నా కేసీఆర్ తొమ్మిదేళ్లు ఇచ్చిన కరెంటును కూడా నడిపించలేని అసమర్థులు రాజ్యమేలుతున్నరు. కరెంటు ఎందుకు ఆగమవుతుంది' అంటూ రేవంత్ సర్కారును కేసీఆర్ ప్రశ్నించారు.

**ప్రజలను ఎందుకు బాధపెడుతున్నరు ? :** ప్రజలను ఎందుకు బాధలుపెడుతున్నరు? మిగులు కరెంటు ఉండే పద్ధతిలో మేం చేశాం. ఆ మాత్రం మీకు చేయచేతనైతలేదా? సరఫరా జరిగిన కరెంటును అలాగే ఇవ్వచ్చు కదా? ఎందుకు ఇవ్వలేకపోతున్నారు ? మిషన్ భగీరథతో మంచినీళ్లు తెచ్చి అర్బన్ ఏరియాలో.. మున్సిపల్ ఏరియాలో అన్నివర్గాల పేదలకు దొరకాలని ఒక్కరూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చాం. ప్రతి ఇంట్లో నల్లా బిగించి ప్రతి ఇంటికీ నల్లా నీరందించాం. ఇవాళ మిషన్ భగీరథ ఎందుకు నడుపలేకపోతున్నరు.

మీ తెలివితక్కువ తనం ఏందీ? దయచేసి ప్రజలు ఆలోచించాలి. ఆ నాడు నీళ్లకోసమే గోస. నాలుగైదు నెలలకే.. కేసీఆర్ పక్కకు జరుగంగనే ఎందుకు మాయమై పోయినయ్ ? ఎందుకు బాధపడుతున్నరు ? సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

**కేసీఆర్‌ను తిట్టాలి పబ్బం గడుపుకోవాలి..** 'ఈ జిల్లాలో ఉన్న మంత్రులు కేసీఆర్‌ను తిట్టడం ఒకటే పని. కేసీఆర్‌ను తిట్టాలి పబ్బం గడుపుకోవాలి తప్పా.. పంటలు ఎండబెట్టారు.. రైతుబంధు ఎగొట్టారు.. రైతుబంధు ఐదెకరాలు అని మాట్లాడుతున్నారు. ఏం పోయింది మీ అబ్బసొత్తా ? ఇచ్చేందుకు మీకు ఏం బాధైంది. ప్రభుత్వం సహాయం లేకుండా ప్రపంచంలో ఎక్కడా రైతులు వ్యవసాయం చేయడం లేదు. దాన్ని గమనించే భారతదేశంలో తొలిసారిగా రైతులకు అండగా ఉండాలని, అప్పులు తీరాలని బడ్జెట్ నుంచి రూ.15వేలు–రూ.16వేలకోట్లు పెట్టి రైతుబంధు ఇచ్చాం. నేను వస్తుంటే ఆర్జాలబావి దగ్గర బస్సును రైతులు ఆపారు. సార్ 20 రోజులైంది ధాన్యం తెచ్చి ధాన్యం కొనడం లేదని చెప్పారు. ఎందుకు వస్తుంది ఈ పరిస్థితి ? బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు ఇదే నరేంద్ర మోదీ వద్దు కొన అని మొండి కేస్తే.. ముఖ్యమంత్రితో సహా తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీలో ధర్నా చేసి.. నరేంద్ర మోదీ మెడలు వంచి.. మా తెలంగాణ పండిస్తున్నది. న్యాయంగా కొనాలి అని చెప్పి కొనుగోలు చేసేలా చేశాం. మద్దతు ధర రూపాయి తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతుల అకౌంట్లలో వేశాం' అన్నారు.

# ఏండిరబై గంత తాగిన్రు

హైదరాబాద్ : తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు ఏ రేంజ్‌లో ఉన్నాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఉదయం 9 గంటల నుంచే నిప్పుల కొలిమిలా మారుతుంది. మధ్యాహ్నం ఇంట్లో నుంచి అడుగు భయటపెట్టాలంటే జనం వణికిపోతున్నారు.

సాయంత్రం ఏడింటి వరకు వేడి ఏమాత్రం తగ్గడం లేదు. మండిపోతున్న ఎండలతో బీర్లను మంచినీళ్లలా తాగేస్తున్నారు మద్యం ప్రియులు. తాజాగా ఎక్సైజ్ అధికారులు విడుదల చేసిన లెక్కలు చూస్తేనే కిక్కొచ్చేలా ఉంది. కేవలం 18 రోజుల్లోనే 670 కోట్ల రూపాయల విలువ చేసే 23 లక్షల కేసుల బీర్లను తాగేశారు. ఈ రకంగా రోజుకు 37 కోట్ల రూపాయల విలువ చేసే బీర్లు తాగుతున్నారు. ఒక్కరోజు కూడా పూర్తి కాకుండానే లక్ష కేసుల బీర్లు అలా లేచిపోతున్నాయి. ఇది తెలంగాణ చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు అని అధికారులు చెబుతున్నారు. గతేడాది ఇదేనెలలో జరిగిన బీర్ల అమ్మకాల కంటే ఇది 28.7% అధికం అని చెబుతున్నారు. 15 రోజులుగా బీర్ల తయారీ తగ్గడంతో అమ్మకాలు ఇంకాస్త తగ్గాయని లేదంటే ఇంకా పెరిగి ఉండేవని చెబుతున్నారు. వర్ష ప్రభావం లేకపోవడంతో బీర్ల కొరత ఏర్పడిందని.. డిమాండ్‌కు తగ్గ బీర్లను అందించలేకపోతున్నామని అంటున్నారు.




**రికార్డు సెట్ చేయాలన్నా మేమే..** మద్యం అమ్మకాల రికార్డులు బద్దలు కొట్టడం తెలంగాణకు ఇది కొత్తేం కాదు. దసరా టైమ్‌లో, సమ్మర్ టైమ్‌లో ఇలా కొత్త రికార్డులు నమోదవుతూనే ఉంటాయి. దసరా టైమ్‌లో వారం రోజుల్లోనే 1100 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగిన రికార్డు తెలంగాణ పేరిట ఉంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ వాళ్ల రికార్డులను వాళ్లే బద్దలు కొడుతున్నట్లు.. తెలంగాణ మద్యం ప్రియులు కూడా ఎప్పటికప్పుడు ఫ్రెష్ రికార్డులను సెట్ చేస్తూనే ఉంటారు.



## కేసీఆర్‌ను నమ్మితే పద్మారావు మునిగినట్టే

హైదరాబాద్: సికింద్రాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని.. కేంద్రంలోనూ తమ ప్రభుత్వమే రాబోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ఆనాడు దత్తాత్రేయని ఓడించి.. అంజన్ కుమార్ యాదవ్ సికింద్రాబాద్‌లో మూడు రంగుల జెండా ఎగరేశారు. అప్పుడు కేంద్రంలో సోనియమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఆనాటి రోజులను పునరావృతం చేయడానికి దానం నాగేందర్ 3 రంగుల జెండా ఎగరేయబోతున్నారు. దానం గెలిచి కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యత నిర్వహించబోతున్నారు. భాజపా నాయకులు గెలిచి కేంద్ర మంత్రులు అయినా హైదరాబాద్‌కు చేసిందేమిటి? వరదలు వచ్చి హైదరాబాద్ అతలాకుతలమైతే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నగరానికి చిల్లిగవ్వ తేలేదు. జంట నగరాల్లో మెట్రో రైలు రావడానికి కాంగ్రెస్సే కారణం. భారాస అభ్యర్థి పద్మారావు మంచోడే కానీ.. కేసీఆర్‌ను నమ్ముకుంటే ఆయన మునిగినట్టే. అతని పరువు తీయడానికే సికింద్రాబాద్ అభ్యర్థిగా నిలబెట్టారు. పద్మారావు నామినేషన్‌కు కేటీఆర్, కేసీఆర్ ఎందుకు రాలేదు? ఆయనకు వాళ్లు మద్దతు ఇవ్వడంలేదు. సికింద్రాబాద్ టికెట్‌ను భాజపాకు తాకట్టు పెట్టారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం చేసే బాధ్యత మాది. భారాసకు ఓటు వేస్తే మూసీలో వేసినట్లే. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే. మత సామరస్యాన్ని కాపాడింది మా పార్టీ. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. దేవుడిని ప్రధాని మోదీ బజారులోకి తీసుకొచ్చారు. మత చిచ్చుపెట్టి ఎన్నికల్లో నెగ్గాలని భాజపా చూస్తోంది" అని విమర్శించారు.

# నీ సవాల్ స్వీకరిస్తున్నా!



## హరీశ్‌రావు రాజీనామాపత్రం జేబులో పెట్టుకో

## మాజీ మంత్రి వ్యాఖ్యలకు ఘాటుకు స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్: మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. "రైతు రుణమాఫీ చేస్తే హరీశ్‌రావు రాజీనామా చేస్తామంటున్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షలు రుణమాఫీ చేసి తీరుతాం. హరీశ్‌రావు రాజీనామా పత్రం జేబులో పెట్టుకోవాలి. కేసీఆర్ మాదిరిగా హరీశ్‌రావు మాట తప్పవద్దు" అని సీఎం సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే నాయకులు కావాలి. ఎంపీ టికెట్ కోసం కడియం శ్రీహరి కాంగ్రెస్‌ను సంప్రదించలేదు. కడియం వద్దకు కాంగ్రెస్ పెద్దలను పంపించాం. మెదడు కరిగించి కాళేశ్వరం కట్టామని కేసీఆర్ చెబుతున్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టారు. మేడిగడ్డ మేడిపండు అయింది.. సుందిళ్ల సున్న అయింది. అన్నారం ఆకాశంలో కలిసింది.

కాంగ్రెస్, భారాస కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయో చూడాలి. కేసీఆర్‌ను సూటిగా అడుగుతున్నా.. కాళేశ్వరం రండి చూద్దాం. అక్కడే కూర్చొని నిపుణులతో చర్చిద్దాం. కేసీఆర్‌కు దమ్మూ ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం రావాలి. ఆ పార్టీకి ఎక్కడా డిపాజిట్లు వచ్చే పరిస్థితులు లేవు. అసెంబ్లీకి రాని కేసీఆర్... టీవీ స్టూడియోల్లో గంటలపాటు కూర్చొని ప్రగల్భాలు పలుకుతున్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. వరంగల్ అంటే దేశానికి తలమానికమైన పీవీ, కాళోజీ, జయశంకర్ గుర్తొస్తారు. హైదరాబాద్ మాదిరిగా వరంగల్‌కు ఔటర్ రింగ్‌రోడ్డుతో పాటు ఎయిర్‌పోర్టు నిర్మిస్తాం. ఈ నగరానికి మహర్దశ తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటాం. కాకతీయ యూనివర్సిటీ నిర్వీర్యమైంది. వీసీతో పాటు బోధనాసిబ్బందిని నియమిస్తాం. యూనివర్సిటీని ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తాం" అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# మోడీ మాస్టారు కామెంట్స్ టీడీపీ జనసేనలకు తలనొప్పేనా ?

దేశంలో మరోసారి అధికారంలోకి వస్తుందని బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. జగన్ వల్ల అన్ని విధాలుగా దెబ్బ తిన్న ఏపీ కోలుకోవాలంటే కేంద్ర సాయం తప్పనిసరి అని అంటున్నారు. అది నిజమే. ఏపీకి కేంద్రం మద్దతు అన్ని విధాలుగా అవసరం. బీజేపీతో పొత్తు వల్ల దానితో పాటుగా ఏపీలో వ్యవస్థలను సక్రమంగా పనిచేసేలా చూసుకోవడం వంటివి కూడా ఉన్నాయి. ఇంకా తెర వెనక కూడా మరెన్నో ఆశలు ఉన్నాయని చెబుతారు. సరే ఇవన్నీ ఒక ఎత్తు అయితే బీజేపీ వల్ల ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఆ పార్టీ ముస్లిం మైనారిటీ వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని, బలహీన వర్గాలు దూరం అవుతారని భయాలు ఉన్నాయని అంటున్నారు. వీటికి అదనంగా ఏపీలో చూస్తే ప్రత్యేక హోదా ఇవ్వడం లేదు, పోలవరం నిధులు ఇవ్వడం లేదు, రాజధానికి ఆసరాగా ఉండటం లేదు, ఆఖరుకు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అన్న గుదిబండ కూడా ఉంది. పోనీలే వీటికి కూడా ఎదో విధంగా సర్దుబాటు చేసుకోవచ్చు అనుకున్నా బీజేపీతో పొత్తు కుదిరిన మరునాడే యూనిఫాం సివిల్ కోడ్ ని అమలు చేస్తున్నట్లుగా ప్రకటించేసింది. దాంతో ప్రధానంగా ఒక వర్గం గుర్రుగా ఉందని టాక్ ఉంది. ఇపుడు మోడీ తన ప్రసంగాలలో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారు అని ఇండియా కూటమి మండిపడుతోంది. ఇంతకీ మోడీ ఏమిటి అన్నారు అంటే ఆయన ఎన్నికల వేళ ముస్లిమ్స్ ని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలే చేశారు. ఎన్నికలు వచ్చేసరికి ముస్లిమ్స్ కి కాంగ్రెస్ దన్నుగా ఉంటుందని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజల సంపద మొత్తం ముస్లిం లకు పంచుతుందని హాట్ కామెంట్స్ చేసారు. దేశంలో వనరుల మీద మైనారిటీలతో తొలి హక్కు అని యూపీఏ హయాంలో పేర్కొన్నారు అని కూడా ఆయన చెప్పడం విశేషం. ఇలా మోడీ చేసిన ఈ కామెంట్స్ ఏపీలో టీడీపీ జనసేలకు బిగ్ ట్రబుల్ గా మారుతున్నాయని అంటున్నారు. ఇప్పటికే మైనారిటీలు వైసీపీ వైపు టర్న్ అయ్యారు అని టాక్ నడుస్తోంది. దానికి మరింతగా ఆజ్యం పోసేలా మోడీ మాస్టర్ కామెంట్స్ ఉన్నాయని అంటున్నారు. బీజేపీ పొలిటికల్ ఫిలాసఫీకి ఆ కామెంట్స్ వల్ల లాభమే కానీ నష్టం ఉండదు, కానీ ఏపీలో టీడీపీ జనసేనల పరిస్థితి మాత్రం కక్కలేక మింగలేక అన్నట్లుగా ఉంటుందని అంటున్నారు. అసలు మోడీ కామెంట్స్ ని వ్యతిరేకించాలా లేక సమర్ధించాలా అన్న సంశయంతో టీడీపీ జనసేన ఉన్నాయని అంటున్నారు. ఏపీలో చూస్తే ఏకంగా 18 నుంచి ఇరవై శాతం వరకూ మైనారిటీ ఓటు బ్యాంక్ ఉంది. మోడీ తాజా వ్యాఖ్యలతో కూటమి మీద ఈ ప్రభావం గట్టిగానే పడుతుందని అంటున్నారు. ఇక మైనారిటీలకు తాము రక్షణగా ఉంటామని ఒక వైపు చంద్రబాబు హామీలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు. కానీ మోడీ కామెంట్స్ తో మొతానికి మొత్తం ప్రచారమే తుడిచిపెట్టుకుని పోయింది అని అంటున్నారు. ఈ పరిణామాలు చూసిన వారు కూటమిలో ఉన్న బీజేపీ వల్లనే టీడీపీ జనసేన కూడా నిండా మునగబోతున్నా యా అని కూడా తలలు పట్టుకుంటున్న నేపథ్యం ఉందిట.

# కాలుష్యం.. కాటేస్తోంది



పెద్దపల్లి : మానవాళి తప్పిదాలు వాతావరణ సమతుల్యతకు పెనుసవాల్‌గా మారాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం, కాలుష్య ఉద్గారాలు పెరగడం, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం.. క్రమేణా భూతాపం పెరగడానికి కారణమవుతున్నాయి. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు అమలు చేయకపోవడం, పట్టణీకరణ పేరుతో కాంక్రీట్ అరణ్యాలు పెరిగిపోతుండటం పెను విపత్తుగా మారాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా మేలుకోకపోతే రాబోయే తరాల మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. సోమవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఇదీ ఉద్దేశం

1969లో అమెరికాలోని శాంటా బార్బరాలో చమురు పేలుడు ప్రమాదం తీవ్ర విషాదం మిగిల్చింది. జల, భూ జీవావరణాన్ని దెబ్బతీసింది. ఈ క్రమంలో ప్రకృతికి విఘాతం కలిగించకుండా అమెరికా రాజకీయవేత్త గేలార్డ్ నెల్సన్‌కు ఓ ఆలోచన తట్టింది. వాతావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందంటూ అధ్యక్షుడు కెనెడీకి ప్రతిపాదించారు. ఈ మేరకు వాతావరణంలో వస్తున్న మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అంశాలను 1970 ఏప్రిల్ 22న దేశ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఏటా ఈ రోజున ప్రపంచ ధరిత్రి దినోత్సవం(వరల్డ్ ఎర్త్ డే)గా పాటిస్తున్నారు. ప్రపంచంలోని 193 దేశాలు ఈ క్రతువులో పాల్గొంటున్నాయి.

ప్రమాద ఘంటికలు

బొగ్గు గనులు, గ్రానైట్, ఇసుక తవ్వకాలతో క్రమంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పరిశ్రమలు, రైసు మిల్లులు, ఇటుక బట్టీలు వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలతో కర్బన ఉద్గారాలు పెరిగి గాలి కలుషితమవుతోంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య టాస్మన్ సముద్రంలో ఉన్న లార్డ్ హౌవ్ ద్వీప తీరంలో మరణిస్తున్న పక్షులు, చేపలు, జంతువుల కళేబరాలను వైద్య నిపుణులు పరిశీలించగా వాటి పొట్టలో ప్లాస్టిక్ అవశేషాలు కనిపించడం పరిస్థితికి అద్దం పడుతోంది. కాలుష్య కారకాలతో ఓజోన్ పొర ప్రమాదంలో పడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ మేల్కొంటేనే పుడమి తల్లిని సంరక్షించుకోవచ్చు.

మొక్కల పెంపకమే శ్రీరామరక్ష

వాయు కాలుష్యాన్ని తగ్గించాలి. పరిశ్రమల వ్యర్థ నీటిని శుద్ధి చేసి మొక్కల పెంపకానికి వినియోగించాలి. ÿ తడి, పొడి చెత్తను ఆరుబయట నిల్వ చేయకుండా డంపింగ్ యార్డుకు తరలించి జీవ ఎరువుల తయారీని ప్రోత్సహించాలి.

అడవుల నరికివేతను అరికట్టాలి. పచ్చదనం కోసం విరివిగా మొక్కలు నాటడమే కాకుండా బతికించాలి. ÿ పర్యావరణ ఇతివృత్తంగా విద్యాసంస్థల్లో నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలను మొక్కుబడిగా కాకుండా పక్కాగా అమలు చేయాలి.ÿ అధిక ఎరువుల వినియోగం అనర్థాలను రైతులకు వివరించాలి.

నిబంధనలు పాటించని కర్మాగారాలపై చర్యలు తీసుకోవాలి.

పచ్చదనంపై గొడ్డలి వేటు


పట్టణీకరణ పేరిట చెట్ల నరికివేతతో అడవుల విస్తీర్ణం తగ్గుతోంది. వేటగాళ్ల గొడ్డలి వేటుకు వృక్షాలు నేలకొరుగుతున్నాయి. సాగులో రసాయన ఎరువులను అతిగా వాడుతుండటంతో భూసారం క్రమంగా దెబ్బతింటోంది. ఉమ్మడి జిల్లాలోని మంథని, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల అడవుల విస్తీర్ణం అంతంత మాత్రమే. కరీంనగర్ జిల్లాలో అత్యల్పంగా అడవులున్నాయి. కొద్దిపాటి అటవీ సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. హరితహారం పథకంలో భాగంగా ఏటా కోట్ల మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక లక్ష్యం నెరవేరడం లేదు.

ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం

వాతావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. పెట్రోల్, డీజిల్ అతిగా వినియోగిస్తుండటంతో కర్బన ఉద్గారాలు ప్రాణాలను హరిస్తున్నాయి. ఓజోన్ పొర దెబ్బతిని సూర్య కిరణాలు నిట్ట నిలువుగా పడుతుండటంతో భూతాపం పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణపై మా సంఘం ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటడంతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాల్సిన అవసరం ఉంది.

లైశెట్టి రాజయ్య, గోదావరి ప్రదూషణ, పరిహరణ, పర్యావరణ, పరిరక్షణ గవాక్ష సంఘం అధ్యక్షుడు, గోదావరిఖని

# విద్యార్థులకు ప్రేరణ సువర్ణావకాశం




పెద్దపల్లి : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర విద్యాశాఖ 'ప్రేరణ' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను విజ్ఞానవంతులుగా, బాధ్యత గల వ్యక్తులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్ పాఠశాలలో వారం రోజుల పాటు తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ చదివిన గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం మ్యూజియంగా తీర్చిదిద్దింది.

బృందాల వారీగా శిక్షణ

దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక బాలుడు, ఒక బాలికను ఒక ఉపాధ్యాయురాలిని గైడ్ టీచర్‌గా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ కోసం గుజరాత్ వాద్‌నగర్ పాఠశాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ ఏడు రోజుల పాటు జరిగే శిక్షణలో ఒక్కో బ్యాచ్‌లో 20 మంది విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఇలా శిక్షణ పొందిన వారిని అంబాసిడర్లుగా పరిగణిస్తారు. ఈ మేరకు పాఠశాల, జిలా స్థాయిల్లో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది.

ఎంపిక విధానం ఇలా...

జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో 9 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ప్రేరణ పోర్టల్‌లో కోరిన వివరాలను నమోదు చేసుకోవాలి. ఈ ప్రక్రియ ఈనెల 2వ తేదీనుంచే ప్రారంభమైంది. ఇందులో నమోదు చేసుకున్న బాలబాలికల నుంచి పాఠశాల స్థాయిలో ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, కొత్త విషయాలపై ఆసక్తి తదితర అంశాలను పరీక్షించి ప్రతి పాఠశాల నుంచి ఒక బాలుడు, ఒక బాలికను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలోనూ ప్రేరణ ఉత్సవాలు ఉంటాయి. ఇందులో పలు అంశాలపై పోటీలు నిర్వహించి 15 మంది బాలికలు, 15 మంది బాలురను ఎంపిక చేస్తారు. అన్ని కోణాల్లో పరీక్షించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒక బాలిక, ఒక బాలుడిని, ఒక గార్డియన్ ఉపాధ్యాయురాలిని ఎంపిక చేస్తారు. వీరిని ఈనెల చివరి వారంలోగా గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ నిమిత్తం పంపిస్తారు.ఎంతో ఉపయోగకరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రేరణ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఎక్కువ మంది పిల్లలు నమోదు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలి. విద్యార్థుల్లో మనోవికాసానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి. ఇందులో స్వాభిమాన్, ధైర్య సాహసాలు, పరిశ్రమలు, నిజాయితీ, జాతీయ విద్యా విధానం తదితర అంశాల్లో తర్ఫీదునిచ్చి ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. శిక్షణ పొందిన వారు బడికి వచ్చాక తమ అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకోవాలి.పీఎం. షేక్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త

# కంపుకొడుతున్న హుస్సేన్‌సాగర్

హైదరాబాద్: నాలాల నుంచి వస్తున్న వ్యర్థ జలాల శుద్ధిని గాలికొదిలేయడంతో హుస్సేన్‌సాగర్ మురికి కూపంలా మారుతోంది. దీనికి తోడు ఎండలు అధికంగా ఉండటంతో ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి పరిసర ప్రాంతాలు దుర్వాసన వస్తున్నాయి. సాయంత్రం సరదాగా వెళ్లి గడపాలనుకున్నా ఎక్కువ సమయం ఉండలేకపోతున్నామని సందర్శకులు వాపోతున్నారు. నిత్యం 400 ఎంఎల్‌డీల వ్యర్థజలాలు సాగర్‌లో కలుస్తుండగా సెలవు రోజుల్లో శుద్ధి చేయకుండానే వ్యర్థాలను వదులుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్) క్రమంగా తగ్గుతోంది. తాజాగా పీసీబీ విడుదల చేసిన నివేదిక ఇందుకు ఊతమిస్తోంది. గత 3 నెలల్లో సాగర్ చుట్టూ ఉన్న 9 ప్రాంతాల్లో నీటి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌లో పరిశీలించగా అనేక చోట్ల డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ నిర్దేశిత పరిమితి కన్నా తక్కువగా ఉందని తేలింది. సాధారణంగా



లీటరు నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం 4 ఎంజీలు ఉండాలి. కానీ ఫిబ్రవరి, మార్చిలలో 3.2 సగటు నమోదైంది. నిర్దేశిత పరిమితుల ప్రకారం లీటరు నీటిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) 3 ఎంజీల కంటే తక్కువ ఉండాలి. మార్చిలో నీటి నమూనాలను పరిశీలించగా నెక్లెస్‌రోడ్ వద్ద అత్యధికంగా 111, బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 47, మిగిలిన చోట్ల సగటు 14గా నమోదైంది.

# భూతాపం.. మనుగడకు శాపం

ఖమ్మం : విచ్చలవిడిగా చెట్లు నరికివేయడం, వాహనాల, పారిశ్రామిక కాలుష్యం, మొక్కలు నాటకపోవడం వంటి కారణాలతో రోజురోజుకీ భూతాపం పెరుగుతోంది. ఎండలు మండుతున్నాయి. ఏసీలు, కూలర్లు లేనిదే ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే ఎండలు 45 డిగ్రీలు దాటి 50 డిగ్రీల దాకా నమోదవుతున్నాయి. ఇలాగే కొనసాగితే మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికైనా మేల్కొని భూతాపాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం...

మొక్కలే జీవనాధారం వాతావరణ సమతుల్యాన్ని కాపాడటంలో మొక్కలది ప్రధాన పాత్ర. వాతావరణంలోకి కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహించి ప్రాణవాయువును ఇస్తాయి. వర్షాలు కురిసేందుకు సహకరిస్తాయి.వాతావరణాన్ని చల్లబరుస్తాయి.

హరితహారం ఇలా..ఖమ్మం జిల్లాలో హరితహారంలో భాగంగా 2023 వరకు 70,31,414 మొక్కలు నాటారు. ఈసారి 70.57 లక్షల మొక్కలు నాటటం లక్ష్యంగా పెట్టుకున్నారు.

భద్రాద్రి జిల్లాలో 2023 వరకు 67,52,453 నాటారు. ఈ ఏడాది 65.738 లక్షలు నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

ప్లాస్టిక్ భూమికి ప్రధాన శత్రువు. ఇది భూమిలో కలిసిపోవడానికి ఏళ్లు పడుతుంది. ప్రభుత్వాలు ఎన్ని రకాల చట్టాలు చేస్తున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. భావితరాల కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ప్యాక్టరీలను మూసేయాలి. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపేయాలి. అవగాహన పెరగాలి.

ఎర్త్ డే అంటే...1969లో అమెరికా సెనెటర్ గెలార్డ్ నెల్సన్ ఆలోచనకు ప్రతి రూపమే ఎర్త్ డే. పర్యావరణానికి హాని కలిగించే, భూగ్రహం నాశనానికి దారితీసే కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, అటవీ నిర్మూలన వంటి సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా 1970 నుంచి ఏప్రిల్ 22న ఎర్త్‌డే నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించటమే ప్రధానోద్దేశం. ఈ ఏడాది నినాదం 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్'. ఈ ఏడాది ఆతిథ్య దేశం సౌదీ అరేబియా.

బాబోయ్ ఎండలు

ఏటా ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోంది. 50 డిగ్రీలకు దరిదాపులకు ఉష్ణోగ్రతలు చేరువవుతున్నాయి. ఆదివారం ముదిగొండ మండలం పమ్మిలో 44.9 డిగ్రీలు, నేలకొండపల్లిలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్‌లోనే ఉమ్మడి జిల్లా నిప్పుల కుంపటిలా మారింది. వచ్చే నెలాఖరు వరకు ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

కాలుష్యానికి కారణాలు...

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒకప్పుడు పచ్చటి అందాలతో అలరారింది. నేడు భారీ పరిశ్రమలు, గనులు, కర్మాగారాలు, గ్రానైట్, బైరైటీస్ ఇండస్ట్రీలు, పార్‌బాయిల్డ్ మిల్లులు, ఇటుక బట్టీలు, చేపల చెరువులు ఏర్పడ్డాయి. రియల్ ఎస్టేట్ రంగం విస్తరిస్తోంది. వాహనాలు, ఏసీలు, మొబైల్ ఫోన్లు, టవర్లు పెరిగాయి. అభివృద్ధికి ఇవి అవసరమే అయినా ఆ మేరకు అడవులు వృద్ధి చెందలేదు. వ్యవసాయంలో మితిమీరిన రసాయనాలు, ఎరువుల వినియోగం పెరిగింది. అడవుల నిర్మూలన, పోడు వ్యవసాయం చేపట్టారు.

అటవీ విస్తీర్ణం రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో అడవులు కలిగిన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం. 4.31 లక్షల హెక్టార్లలో అడవులు వ్యాపించి ఉన్నాయి.

పోడు వ్యవసాయం: 26,688 ఎకరాలు

ఖమ్మం జిల్లాలో..

అటవీ విస్తీర్ణం 63,941.9 హెక్టార్లు (14.66 శాతం)

ప్లాస్టిక్ నివారణకు కట్టుబడదాం

ప్లాస్టిక్ వినియోగం వల్ల ధరిత్రి స్వచ్ఛతను కోల్పోతోంది. విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వాడుతున్నారు. దీన్ని నియంత్రించాలి. ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అధికారులు అవగాహన కల్పించాలి. మొక్కలను విరివిరిగా పెంచడం వల్లనే భూమిని కాపాడుకోగలం. వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్ల రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ప్రతీ ఒక్కరూ ధరిత్రి రక్షణ తమ బాధ్యతగా వ్యవహరించాలి.

కడవెండి వేణుగోపాల్, పర్యావరణ మిత్ర జాతీయ పురస్కార గ్రహీత

మొక్కలు నాటండిమనకోసం, భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటాలి. పుట్టిన రోజు, పెళ్లి రోజు ఇలా ప్రతి ముఖ్యమైన రోజు మొక్కలు నాటించాలి. సొంత నీటి సీసా, కిరాణా సంచి వెంట తీసుకెళ్తే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవచ్చు. ముద్రణను తగ్గించి, చెట్లను కొట్టివేయకుండా చూడాలి. దగ్గరి దూరాలకు మోటారు వాహనాలు వాడకపోవడం మంచిది.పెసర ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు

# ఉల్లంఘనులకు తప్పదు భారీ మూల్యం

కొత్తగూడెం : లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ముఖ్యనేతలు సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ ఓటర్లకు దగ్గరవుతున్నారు. ఈ తరుణంలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని గుర్తుంచుకోవాలి. తద్వారా భవిష్యత్తులో ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్లపైనా ప్రభావం పడే అవకాశముంటుంది.హద్దు మీరితే అంతే సంగతులు సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఉద్యోగులు ఈసీ పరిధిలో పనిచేయాలి. ప్రభుత్వ, కార్పొరేషన్, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే అన్ని కేటగిరీల ఉద్యోగులు తమ విధులకు పరిమితమవ్వాలి తప్ప ఏ రాజకీయ పార్టీలకు కొమ్ముకాయొద్దని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా వారిపై నిరంతరం నిఘాతో పాటు ఫేస్‌బుక్, వాట్సాప్ పోస్టులపై ఓ కన్నేసి ఉంచుతున్నారు. ఉద్యోగులు వివిధ రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా వ్యవహరించే సన్నివేశాన్ని దృశ్యరూపకం లేదా శ్రవణరూపకం ద్వారా ఎవరైనా చిత్రీకరించి ఎన్నికల సంఘానికి పంపించినా, ప్రచార మాధ్యమాల్లో పోస్టు చేసినా సదరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు తప్పదనేది ఇటీవల జరిగిన ఉదంతాలు చాటిచెబుతున్నాయి.

నిఘా నేత్రం చూస్తోందిఎన్నికల కోడ్ అమలులో భాగంగా వీడియో సర్వైలెన్స్, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ బృందాల ఎంపిక ప్రక్రియను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. అభ్యర్థుల సభలు, సమావేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా వాటిలో పాల్గొన్నట్లు తెలిసినా, ఫిర్యాదులు అందినా సంజాయిషీ నోటీసులు జారీ చేస్తారు. ఉల్లంఘించినట్లు తేలితే సస్పెన్షన్ వేటు వేస్తారు.

# పర్యావరణ హితంగా సికింద్రాబాద్ స్టేషన్

హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను పర్యావరణ హితంగా అభివృద్ధి చేస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయ స్థాయి సదుపాయాలతో అందుబాటులోకి రానుంది. రూ.719 కోట్లతో చేపడుతున్న ఈ పురాతన స్టేషన్ అభివృద్ధి పనుల్లో గ్రీనరీకి పెద్ద పీట వేస్తున్నారు. కనీసం ఆరువేల గజాల మేర పచ్చిక బయళ్లు, పూల వనాలతో నింపనున్నారు. సికింద్రాబాద్ పరిసరాల్లో విపరీతమైన కాలుష్యమున్న నేపథ్యంలో ఇక్కడ ఇంధన వనరులు కాపాడటం, వర్షపు నీటితో జలసంరక్షణ, వాడిన నీటినే మళ్లీ వాడే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిబింబాలతో నేరుగా సూర్యకాంతి స్టేషన్‌లోకి ప్రసరించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్టేషన్‌లో సంచారం తక్కువ ఉండే ప్రాంతాల్లో మనుషులు వచ్చినప్పుడే లైట్లు వెలిగేలా వ్యవస్థను నెలకొల్పుతున్నారు. పర్యావరణహితంగా నిర్మించి 2025కల్లా అందుబాటులోకి తీసుకు రావాలన్నది ద.మ. రైల్వే ప్రణాళిక.

పార్కులు, పచ్చిక బయళ్లు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణ మొత్తం ఐదు ఎకరాల విస్తీర్ణంలో అందుబాటులోకి వస్తోంది. ఇందులో ఎకరానికి పైగా పచ్చిక బైళ్లు,





పార్కులు ఉంటాయి. ఇండోర్ ప్లాంట్లను కూడా విరివిగా ఉంటాయి. పై అంతస్తుల్లో కూడా పచ్చిక బయళ్లు, మొక్కలు, పార్కులు ఉండేలా చూస్తున్నారు. వీటికి తోడు చుక్క నీరు వృథా కాకుండా అంతా రీసైక్లింగ్ ప్లాంటుకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు మూడు లక్షల లీటర్ల నీటిని మళ్లీ వినియోగించేలా చూస్తున్నారు. స్టేషన్ మొత్తమ్మీద.. జనసంచారం ఉంటేనే లైట్లు వెలిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 38 ఎస్కలేటర్లు వస్తున్నాయి. ఫుడ్ కోర్టులు, మాల్ మాదిరి షాపింగ్, విశ్రాంతి గదులు, స్టార్ హోటల్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

మెట్రో, ఆర్టీసీ అనుసంధానం..

ఇప్పుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగి సామాన్లతో మెట్రో స్టేషన్‌కు వెళ్లడం గగనంగా మారింది. ఈ స్టేషన్ నిర్మాణం జరిగితే ప్రతి ప్లాట్‌ఫాం నుంచి సులభంగా మెట్రో స్టేషన్‌కు చేరుకునేలా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆర్టీసీ బస్సు స్టేషన్లకు కూడా నేరుగా స్టేషన్లోంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌కు ఇరువైపులా ప్రజలు తిరిగేలా 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన రానుంది. సామాన్లతో సులభంగా నడుచుకుని వెళ్లాలా వంతెనలు ఉండనున్నాయి. ఇండోర్ గేమ్స్ కూడా అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతానికి 20 శాతం పనులు పూర్తయ్యాయి. ఆగస్టు 2025 నాటికి అందుబాటులోకి తీసుకు రావాలనుకున్నా.. 2026 నాటికి పూర్తి చేయాలని ద.మ. రైల్వే భావిస్తోంది.

# జోష్.. వస్తలేదు

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు గ్రేటర్ సిద్ధమవుతోంది. ఇప్పటికే నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కిందిస్థాయి నేతలు, క్యాడర్‌లో ఉన్న జోష్.. ఇప్పుడు కనిపించడం లేదు. నేతల పిలుపు వస్తే చూద్దాంలే అన్నట్లు కిందిస్థాయి కార్యకర్తలు, చోటామోటా నేతలు ఉన్నారు. అన్ని ప్రధాన పార్టీల్లోనూ ఇదే పరిస్థితి. మహానగర పరిధిలో నాలుగు ఎంపీ స్థానాల్లో అన్ని పార్టీల నుంచి కీలక నేతలే రంగంలో ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంలో లక్షల్లో ఓట్లు ఉండటం, అసెంబ్లీ మాదిరిగా ప్రతి ఓటుపై దృష్టి పెట్టే అవకాశం ఉండకపోవడంతో కూడా కింది స్థాయి కేడర్ ఎవరికివారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత నేతలు పూర్తి స్థాయిలో రంగంలోకి దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అన్ని ప్రధాన పార్టీలు ప్రచార రథాలు సిద్ధం చేశాయి. ఖర్చులు తడిసి మోపెడు.. ప్రచారపర్వంలో జనసమీకరణే కీలకం. దీంతో



నెల, 20 రోజుల ముందే ప్రచారంలోకి దిగితే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ప్రచారం జరిగినన్ని రోజులూ జనసమీకరణ జరుపుతూ.. భోజనాలు ఇతరత్రా ఖర్చులను అభ్యర్థులే భరించాల్సిఉంది. బైక్ ర్యాలీలు, ప్రచార సభలకు భారీగా ఖర్చు చేయాల్సిందే. ప్రచారంలో పాల్గొనేవారికి రూ.300-500 ఇస్తే తప్పా పార్టీల జెండాలు మోసే వారు కరువయ్యారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆఖరి 10-15 రోజులు ఎక్కువ ప్రచారం చేసుకునేలా అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## లీజుకు హెచ్‌ఎండీఏ కాంప్లెక్స్‌లు

హైదరాబాద్: అమీర్‌పేటలోని హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ప్రధాన కార్యాలయం తరలింపునకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికలు ముగిసిన వెంటనే తరలింపు ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభంకానుంది. గతంలో బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం కొనసాగేది. అప్పట్లో దీనిని అమెరికన్ కాన్సులేట్ జనరల్‌కు కేటాయించారు. హెచ్‌ఎండీఏను తార్నాకకు తరలించారు. నగరానికి దూరంగా ఉండటం, ట్రాఫిక్ సమస్యతో ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా ఉండటంతో అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కార్యాలయానికి తిరిగి తరలించారు. 8 ఏళ్లుగా ఇక్కడే కొనసాగుతోంది. ఇటీవల అమెరికన్ కాన్సులేట్‌కు సొంతభవనం ఏర్పాటుకావడంతో పైగా ప్యాలెస్ ఖాళీ చేశారు. దీంతో పూర్వంలా హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయాన్ని పైగా ప్యాలెస్‌లో కొనసాగించనున్నారు. అమీర్‌పేటలోని కీలక ప్రాంతంలో స్వర్ణ జయంతి కాంప్లెక్స్ ఏడు అంతస్తుల్లో విస్తరించి ఉంది. హెచ్‌ఎండీఏకు ఇక్కడే మైత్రి వనం, మైత్రి విహార్ అనే మరో రెండు కాంప్లెక్స్‌లున్నాయి. వీటితో ఏటా రూ.12-15 కోట్ల వరకు అద్దె రూపంలో సమకూరుతోంది. ఇటీవల స్వర్ణ జయంతితో పాటు మైత్రీ వనంలను హెచ్‌ఎండీఏ కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించింది. ఈ రెండు కార్యాలయాలను ఐటీ సంస్థలు లేదా మాల్స్‌కు లీజుకివ్వడంతో అధిక ఆదాయం పొందవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# బియ్యమని తెలియకుండానే అక్రమ రవాణా



హైదరాబాద్: పేదల బియ్యం అక్రమ రవాణాలో నేరగాళ్లు తప్పించుకుంటుండగా అమాయకులైన వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు పట్టుబడుతున్నారు. ఏం, ఎందుకు తరలిస్తున్నారో.. తెలియకుండానే లోడును రాష్ట్రాలు దాటించేస్తున్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రేటర్‌లో బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 45కు పైగా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బియ్యాన్ని తరలిస్తున్న ఓ ట్రక్కును స్వాధీనం చేసుకుని విచారించగా తమకేమీ తెలియదని, రోజుకు రూ.2000 ఇస్తామంటే వచ్చానని, లోడును కర్ణాటకకు చేర్చాలని చెప్పారని తెలిపాడు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారని ఓ అధికారి తెలిపారు. నిత్యం టన్నుల కొద్దీ బియ్యం కర్ణాటక, మహారాష్ట్రకు తరలిపోతోంది. మరోవైపు వాహనాలు పట్టుబడగానే 'సార్ బండి రిలీజ్ అవ్వాలి..? ఎంతవుతుంది? ఎన్ని రోజులు పడుతుంది?' అంటూ కొందరు నేతలు అధికారులకు ఫోన్ చేస్తున్నారు.

పట్టుబడిన ఉదంతాలివి..

మహారాష్ట్రకు అక్రమంగా బియ్యాన్ని రవాణా చేస్తున్న ముఠాను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. రూ.3 లక్షల విలువైన సుమారు 15 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సల్మాన్ అనే వ్యక్తి చాంద్రాయణగుట్ట గోదాము నుంచి ఉమర్గా (మహారాష్ట్ర)కు తరలిస్తున్నారని తెలిసింది. కాటేదాన్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న ముఠాను సీసీఎస్ పోలీసులు గతనెల పట్టుకున్నారు. 36 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు ఇటీవల రూ.95 వేల విలువైన 3,800 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు. బాలానగర్ బృందంతోపాటు జీడిమెట్ల పోలీసులు కలిసి జీడిమెట్లలోని సుభాష్‌నగర్‌లో ఓ ఇంట్లో సోదా చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇంటి యజమానిని అదుపులోకి తీసుకున్నారు.్య వనస్థలిపురంలో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తాపూర్ పిల్లర్ నంబరు 162 సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ గోదామును ఇటీవల అధికారులు గుర్తించారు. అక్కడ సుమారు 600 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# పటిష్ఠ యంత్రాంగం.. పక్కా వ్యూహం




వికారాబాద్ : పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా నిఘా ఏర్పాటు చేసింది. నిబంధనల ఉల్లంఘనలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి తదితర అంశాలపై కథనం.

మద్యం పంపిణీ చేసినా..

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు మద్యం పంపిణీకి యత్నిస్తారు. అనుమతి లేకుండా, పరిమితికి మించి మద్యం నిల్వ చేసినా, విక్రయించినా ఓటర్లకు పంపిణీ చేసినా శిక్షార్హులవుతారు. ఇందులో పట్టుబడితే ఎక్సైజ్ చట్టం-1968 ప్రకారం ఆరుమాసాల నుంచి ఏడాది జైలు, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మద్యం పంపిణీపై జిల్లా ఆబ్కారీ అధికారి ఫోన్ నం. 8712658729కు చేసి ఫిర్యాదు చేయవచ్చు.

గెలవాలని కానుకలిస్తారు

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపనతో అభ్యర్థులు తమ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో ఓటర్లకు కానుకలు పంపిస్తుంటారు. చీరలు, కుక్కర్లు, క్రికెట్ కిట్లు, ఫోన్లు ఇలా ఏదీ ఇచ్చినా ఐపీసీ సెక్షన్ 171(ఈ) ప్రకారం ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తారు. కానుకలపై ఆయా మండలాల సహాయ ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్లకు లేదా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఫోన్ నం.08416-357507కు ఫిర్యాదు చేయవచ్చు.

ఓటర్లను బెదిరిస్తే.. కంట్రోల్ రూమ్‌కు..

అభ్యర్థులు కొన్నిసార్లు ఓటర్లను బెదిరిస్తారు. ఇలా చేస్తే ఐపీసీ సెక్షన్ 171 (సి) ప్రకారం ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఆయా పోలీస్‌ఠాణాల నిలయాధికారులకు, ఎన్నికల కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే స్పందిస్తారు. చర్యలు తీసుకుంటారు.

సందేహాల నివృత్తికి..

సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1950 టోల్‌ఫ్రీ సంఖ్యకు ఫోన్ చేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలతో పాటు ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు. అనుమతి లేకుండా గోడ పత్రికలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం, ప్రచారం చేయడం తదితరాలపై ఫిర్యాదులు చేయాలి. ఇప్పటివరకు 115 అందగా, స్పందించి పరిష్కరించారు.

100 నిమిషాల్లోపే పరిష్కారంప్రచార సమయం, కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలుపై సి- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోపు సమస్యను పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్ స్క్వాడ్ తీసుకుంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను సైతం పరిష్కరిస్తారు. ఇప్పటి వరకు 18 ఫిర్యాదులు అందగా, అన్నీ పరిష్కరించారు. ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదుచేసే అవకాశాన్ని కల్పించారు.

# వైద్య కళాశాలలకు అనుసంధాన ఆసుపత్రులు




హైదరాబాద్: హైదరాబాద్ నగరం సమీపంలో ప్రభుత్వ వైద్యకళాశాలల కొరత తీర్చేందుకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నిర్ణయించినా... వైద్య విద్యార్థులకు అవసరమైన ప్రభుత్వ ఆసుపత్రులు రెండు జిల్లాల్లోనూ లేవు. దీంతో రెండు వైద్య కళాశాలలకు అనువైన ఆసుపత్రులను ఎంపిక చేసేందుకు అధికారులు 50, 100 పడకల ఆసుపత్రులు, వాటిలో సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా వైద్యకళాశాలను మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, మేడ్చల్ జిల్లా వైద్య కళాశాలను కుత్బుల్లాపూర్ చింతల్‌లో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత వైద్యకళాశాలల విద్యార్థులకు అనుకూలంగా ఉండే ఆసుపత్రులను నిర్ణయించనున్నారు.

పేద, మధ్యతరగతికి వైద్యసేవలు: నగరం, శివారు ప్రాంతాలు పెరుగుతుండడంతో చుట్టుపక్కల 40 కి.మీ.లవరకు జనావాసాలు విస్తరించాయి. ఇక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలు చికిత్సలకు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రులకు రావాల్సిందే. లేదంటే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాలి. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వంద సీట్ల ప్రభుత్వ వైద్యకళాశాలల ఏర్పాటుకు నిర్ణయించారు. వంద సీట్ల వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. కందుకూరు పరిసర ప్రాంతాల్లో వంద పడకల ఆసుపత్రి కోసం మహేశ్వరం, షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలించారు. చింతల్‌లో నిర్మించనున్న వైద్య కళాశాలకు మల్కాజిగిరి ఆసుపత్రిని అనుసంధానించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

ఉస్మానియా, గాంధీలపై ఒత్తిడి తగ్గించేందుకు..


ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల నుంచి వైద్యసేవల కోసం వస్తున్న రోగుల సంఖ్యను తగ్గించేందుకు, వైద్యసేవలపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు నిర్ణయించారు. తద్వారా ఆ నాలుగు జిల్లాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతాయి. ఆయా ప్రాంతాలనుంచి అత్యవసర వైద్యచికిత్సలకు వచ్చేవారిని ఈ కొత్త ఆసుపత్రులకు తరలించనున్నారు. వైద్యకళాశాలల నిర్మాణం ఏడాదిన్నరలోపు పూర్తిచేయాలన్నది లక్ష్యం. ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించింది.

# ఊరు విడిచినా వారిదే ప్రభావం

పెద్దపల్లి: పెద్దపల్లి లోక్‌సభా నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేకత సంతరించుకొంది. మొత్తం ఏడు మండలాలకు గాను అయిదు మండలాల్లో సింగరేణి గనులు విస్తరించాయి. దీంతో పాటు ఎన్టీపీసీ, జెన్‌కో, కేశోరాం వంటి పరిశ్రమలకు కేంద్రంగా ఉంది. ఓటర్లలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే కావడం విశేషం.సింగరేణి, అనుబంధ పరిశ్రమలు, గుత్తేదారు సంస్థల్లో పనిచేసే వారితో పాటు వ్యాపారుల్లోనూ ఎక్కువ మంది స్థానికేతరులే. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చి పారిశ్రామిక ప్రాంతంలో స్థిరపడగా చాలా మందికి స్వస్థలాలతో అనుబంధం తెగిపోయింది. అయితే ఒక్క పెద్దపల్లి సెగ్మెంటు నుంచి వెళ్లిన వారు మాత్రం సమీపంలోనే ఉండటంతో సొంత ఊళ్లకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో చాలా మందికి రెండు చోట్లా ఓట్లున్నాయి. స్వస్థలాల్లోని పరిస్థితుల ప్రభావం అక్కడి ఎన్నికలపై ఉంటోంది.

స్వస్థలాలతో నేతల అనుబంధం

రామగుండం, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల సెగ్మెంట్‌లలో నాయకులుగా ఎదిగిన వారిలో కొందరికి పెద్దపల్లి ప్రాంతంతో అనుబంధం ఉంది. రామగుండం నగరపాలికలో సగం మంది కార్పొరేటర్లు పెద్దపల్లి పరిసర గ్రామాలు, మండలాలకు చెందిన వారే. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, భాజపా నాయకుడు సోగాల కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, కొప్పుల ఈశ్వర్, నల్లాల ఓదేలు, మర్దమర్రికి చెందిన మాజీ మంత్రి బోడ జనార్దన్ తదితరుల




స్వస్థలాలు పెద్దపల్లి సెగ్మెంట్ పరిధిలోకే వస్తాయి. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలతో అనుబంధం ఉంది. ధర్మపురి మినహా అన్ని సెగ్మెంట్లకు సింగరేణితో అనుబంధం ఉంది.ఓటింగ్ సరళిపై ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై పెద్దపల్లి సెగ్మెంట్ ప్రభావం కనిపిస్తోంది. 2004, 2009 ఎన్నికలు మినహా అన్ని సార్లూ ఇక్కడ గెలిచిన పార్టీయే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలిచింది. గెలిచిన అభ్యర్థికి మిగతా ఆరు సెగ్మెంట్ల కంటే పెద్దపల్లిలోనే అత్యధిక ఓట్లు నమోదవుతున్నాయి. 2004లో తెరాస-కాంగ్రెస్, 2009లో తెదేపా-తెరాస పొత్తు కారణంగా లోక్‌సభ ఎన్నికల్లో కొంత విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. పెద్దపల్లిలో 2004లో తెరాస, 2009లో తెదేపా విజయం సాధించాయి. ఈ రెండు సార్లు మాత్రం ఎంపీగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థికి ప్రతికూల ఫలితాలొచ్చాయి. అయితే రెండు సందర్భాల్లోనూ మంథనిలో ఆ పార్టీకి కలిసొచ్చింది. 2004, 2009లలో అక్కడి నుంచి వరుసగా 13.86 శాతం, 20.32 శాతం ఓట్లను కాంగ్రెస్ సాధించింది.

# తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు

కరీంనగర్ : వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచి కొట్టడం.. అదేస్థాయిలో అవసరాలు పెరిగిపోవడంతో కరీంనగర్‌లోని దిగువ మానేరు జలాశయంలో నీటిమట్టం భారీగా పడిపోయింది. డ్యాం నుంచి గొట్టపు మార్గం ద్వారా వచ్చే నీరు నిలిచిపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే పంపింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రావాటర్ ఆశించిన స్థాయిలో అందక కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో నీటి సరఫరాపై ప్రభావం పడుతోంది. శుద్ధి కేంద్రంలో నీరందక మోటార్లు నిలిపివేయడం, సాంకేతిక సమస్యలతో కుళాయిల వద్దకు నగరవాసులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తుండగా సమయపాలన పాటించడంలేదనే విమర్శలున్నాయి.ప్రత్యామ్నాయ మార్గాలు..నగరంలో మెరుగైన తాగునీటి సరఫరాకు నీటి విభాగ అధికారులు, ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. నీటిశుద్ధి కేంద్రానికి వచ్చే రావాటర్ పెంచడానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకున్నారు. బూస్టర్ పంపుల దగ్గర గతంలో 60 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లు ఉండగా.. వీటిలో రెండింటిని నడిపించి, ఒకటి స్టాండ్‌బైగా ఉంచారు. డ్యాం నుంచి వచ్చే నీరు పెంచుకోవాలని భావించి సిరిసిల్ల లైనుకు ఇంటర్ కనెక్షన్ ఇచ్చి.. 4వ మోటారు నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు మోటార్లు ఏకకాలంలో నడిపించాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా 325 కేవీఏ సామర్థ్యం గల విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. డ్యాంలోని ఇన్‌టేక్ వెల్‌లో ఆరు వాల్వ్‌లు ఉండగా.. మూడు నీటిలో, మూడు బయట ఉన్నాయి. వాల్వ్‌ల చుట్టూ చెత్తాచెదారం లేకుండా విజయవాడ నుంచి వచ్చిన డైవర్స్ మూడు రోజులపాటు శుభ్రం చేశారు. అధికారులు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తూ నగరానికి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మూడు నెలల వరకు ఇబ్బంది లేకుండా..

మధ్య మానేరు జలాశయం నుంచి దిగువ మానేరు జలాశయానికి ఒక టీఎంసీకి పైగా నీరు రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బూస్టర్ పంపులకు ఒత్తిడితో రావాటర్ వస్తుండటంతో శుద్ధి కేంద్రానికి వచ్చే నీటి శాతం పెరిగింది. ఈ నెల 10 వరకు 48 ఎంఎల్‌డీల నీరే నగరానికి సరఫరా చేశారు. ప్రస్తుతం 58 ఎంఎల్‌డీలు చేస్తున్నారు. మూడు నెలల పాటు నగరానికి నీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. రిజర్వాయర్ల పరిధిలోని నల్లా కనెక్షన్లకు రోజు విడిచి రోజు గంటపాటు మెరుగ్గా నీరు సరఫరా చేయాలని అధికారులకు కమిషనర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.తగ్గుతున్న భూగర్భ జలాలు.తాగునీటికి కుళాయిలుండగా, ఇతర అవసరాలకు బావులు, బోర్లపై ఆధారపడుతున్నారు. కొన్ని ఇళ్లలో ఉన్న బోర్లు ఎండిపోగా, మరికొన్ని చోట్ల నీరు తగ్గింది. మరో రెండు నెలలపాటు ఎండలు తీవ్రంగా ఉండి.. వర్షాలు పడే అవకాశాలు లేకపోవడంతో భూగర్భజలాలు మరింత పడిపోయే ప్రమాదముంది. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లి చెరువులో కూడా నీరు తగ్గడం మొదలైంది. దానికి ఊటగా ఉన్న పలు కాలనీల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నాయి. నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఈడీ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఈడీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. బెయిల్‌పై మే 6న తీర్పు ఇవ్వనుంది. కవిత బెయిల్ పిటిషన్‌పై బుధవారం కోర్టులో విచారణకు రాగా.. ఈడీ వాదనలు వినిపించింది. సెక్షన్ 19 కింద కవితను చట్టబద్ధంగా అరెస్టు చేశామని.. అక్రమంగా అరెస్టు చేశారనే దానిలో పసలేదని ఈడీ పేర్కొంది. అలాగే కేసుకు సంబంధించి మరికొన్ని వివరాలను ఈడీ తరపున న్యాయవాది కోర్టు ముందు ఉంచారు. దాదాపు రెండు గంటల పాటు ఈడీ తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అనంతరం తీర్పును స్పెషల్ కోర్టు రిజర్వ్ చేసింది. ఎల్లుండి (ఏప్రిల్ 26) లోగా కవిత తరపు న్యాయవాది రిజైండర్ దాఖలు చేయనున్నారు.

**ఈడీ వాదనలు ఇవే..** కవితను సెక్షన్ 19 కింద చట్టబద్ధంగా అరెస్టు చేశామని.. అక్రమంగా అరెస్టు చేశారనే దానిలో పసలేదని ఈడీ వెల్లడించింది. ఈ కేసులో క్విడ్ ప్రోకో జరిగిందన్నారు. రూ. 581 కోట్లు హోల్ సేల్ వ్యాపారులు సంపాదించారని... అయిదు నుంచి 12 శాతానికి కమీషన్ పెంచారన్నారు. దానివల్ల ప్రభుత్వానికి, ప్రజలకు నష్టం జరిగిందని తెలిపారు. ఈ పాలసీలో ఇండో స్పిరిట్‌కు మేజర్ షేర్ దక్కిందని.,. దీని ద్వారా ఈ అక్రమాలకు పాల్పడ్డారని వెల్లడించారు. పాత పాలసీని పక్కన పెట్టి అక్రమ సంపాదన కోసం కొత్త పాలసీ తెచ్చారని చెప్పారు. విజయ్ నాయర్, మనీష్ సిసోడియా ద్వారా బుచ్చిబాబు, అరుణ్ పిళ్లై కథ నడిపారన్ నారు. విజయ్ నాయర్ మద్యం వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేశారని.. అసాధారణ లాభాలు గడించారని కోర్టుకు విన్నవించారు. బలవంతంగా మహదేవ్ డిస్ట్రిబ్యూటర్ నుంచి పక్కకు తప్పించారన్నా.. ఈ కేసులో మనీష్ సిసోడియా, కేజ్రీవాల్‌కు బెయిల్ దక్కలేదని కోర్టుకు తెలిపారు.

**అవి ఈ కేసులో అనవసరం..** ఆమ్ ఆద్మీ పార్టీకి 100 కోట్ల రూపాయల లంచం అందిందన్నారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి కీలక స్టేట్మెంట్ ఇచ్చారని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్‌ను మాగుంట శ్రీనివాసులురెడ్డి మద్యం వ్యాపారం కోసం ఢిల్లీ సెక్రటేరియట్ కలిశారని.. కవితను కలవాలని కేజ్రీవాల్ చెప్పారని మాగుంట చెప్పారన్నారు. కవితను కలిసినప్పుడు 100 కోట్లు ఆప్‌కి ఇస్తే ఢిల్లీ మద్యం వ్యాపారం ఇస్తారని ఆమె చెప్పిందన్నారు. అందులో రూ.25 కోట్లు కవిత మనిషి బుచ్చిబాబుకు మాగుంట చెల్లించారన్నారు. ఎల్ 1 లైసెన్స్‌లో మేజర్ షేర్ దక్కించుకేందుకు కవిత ప్రయత్నించారన్నారు. అయితే, సమీర్ మహేంద్రకు 33, మాగుంట 33, కవిత 33 శాతం వాటాలను పొందారని కోర్టుకు తెలియజేశారు. బుచ్చిబాబు, మాగుంట రాఘవ వాట్సాప్ మెసేజ్‌లో ఈ సాక్షాలు దొరికాయన్నారు. మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారి అన్ని విషయాలను ధృవీకరించారన్నారు.

ఒకసారి రూ.15 కోట్లు, మరోసారి రూ.10 కోట్లు బుచ్చిబాబుకు, అభిషేక్ బోయినపల్లికి మాగుంట సిబ్బంది ఇచ్చారన్నారు. అనుకూలంగా లిక్కర్ పాలసీ తయారీ కోసం ఈ లంచాలు ఇచ్చారని తెలిపారు. కోర్టు అనుమతితోనే నిందితులు అప్రూవర్‌గా మారారన్నారు. అప్రూవర్‌ను ప్రలోభ పెట్టారని అనుమానిస్తే కోర్టు నిర్ణయాన్ని తప్పు పట్టడమే అని చెప్పుకొచ్చారు. అప్రూవర్‌లపై చేస్తున్న ఆరోపణలు ప్రచారం కోసం చేస్తున్న రాజకీయ వాదనలే తప్పు వాటిలో పస లేదన్నారు. ఎవరు ఎవరికి ఎలక్టొరల్ బాండ్స్ ఇచ్చారనేది ఈ కేసులో అనవసరమన్నారు. చట్టం ప్రకారమే ఈ కేసు ముందుకి వెళ్ళాలని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు.

**కవిత ఒత్తడితోనే అరుణ్ పిళ్లై...** 11.11.2022 న అరుణ్ పిళ్లై తన వాంగ్మూలం ఉపసంహరించుకున్నారని.. కవిత ప్రాక్సీనంటూ అరుణ్ రామచంద్రన్ పిళ్ళై వాంగ్మూలం ఇచ్చారని తెలిపారు. కవితకు నోటీసులు ఇచ్చాకే అరుణ్ పిళ్ళై తాను ఇచ్చిన స్టేట్మెంట్స్ వెనక్కి తీసుకున్నారన్నారు. కవిత ఒత్తిడితోనే అరుణ్ రామచంద్రన్ పిళ్ళై వెనుకడుగు వేశారని చెప్పారు. అరుణ్ పిళ్ళై తన స్టేట్మెంట్ ఇచ్చిన ఆరునెలల తర్వాత వెనక్కి తీసుకున్నారన్నారు. ఈడీ బెదిరిస్తే ఆరునెలల తర్వాత స్టేట్మెంట్ వెనక్కి తీసుకుంటారా అని ప్రశ్నించారు. కవిత, కేజ్రీవాల్, మనీష్ సిసోడియా మధ్య అవగాహన ఉందని బుచ్చిబాబు స్టేట్మెంట్ ఇచ్చారన్నారు. విజయ్ నాయర్‌తో కలిసి లిక్కర్ పాలసీ తయారు చేశారన్నారు. డ్రాఫ్ట్ లిక్కర్ పాలసీ వీళ్ళ దగ్గరకు వచ్చిందని.. బుచ్చిబాబుకి విజయ్ నాయర్ పంపించారన్నారు. కవిత చెప్పిన అంశాలే లిక్కర్ లిక్కర్ పాలసీలో ఉంచారన్నారు. అరుణ్ పిళ్ళై ద్వారా లిక్కర్ వ్యాపారంలో కవిత భాగం అయ్యారని చెప్పారు.

**శరత్ రెడ్డి అమాయకుడు కాదు..** బుచ్చిబాబును తాము అరెస్ట్ చేయలేదని.. ఆయనను సీబీఐ అరెస్ట్ చేసిందని చెప్పారు. శరత్ రెడ్డి అమాయకుడు కాదన్నారు. ఢిల్లీ లిక్కర్ వ్యాపారంలో శరత్ చంద్రరెడ్డి ప్రధాన లబ్ది దారుడని కోర్టుకు చెప్పారు. 5 రిటెల్ జోన్స్ పొందననారు. కవిత బంధువు శ్రీనివాస్ రావు 1 కోటి రూపాయలు అరుణ్ పిళ్ళై కి ఇచ్చాను అని స్టేట్మెంట్ ఇచ్చారన్నారు. కవిత ఆదేశాల మేరకు అరుణ్ పిళ్ళైకి కోటి రూపాయలు ఇచ్చారన్నారు. దినేష్ అరోరా స్టేట్మెంట్ ఇచ్చారని.. ఒబెరాయ్ హోటల్‌లో లిక్కర్ పాలసి రూపొందించారని తెలిపారు. బుచ్చిబాబు కూడా సమావేశంలో పాల్గొన్నారన్నారు.

**కవతి బంధవును విచారణకు పిలిస్తే..** కవిత బంధువు మేక శరణ్‌ను ఇండో స్పిరిట్ ఉద్యోగిగా పెట్టారన్నారు. ఎక్కడ కూడా ఉద్యోగానికి హాజరు కాలేదని.. కానీ జీతం చెల్లించారన్నారు. మేక శరణ్‌ను హైదరాబాద్‌లో విచారించినట్లు తెలిపారు. మొదట విచారణకు పిలిస్తే ఎనిమిది రోజుల పాటు మేక శరణ్ మిస్సయ్యాడన్నారు. ఈ కేసుకు సంబంధించి అనేక మంది వాంగ్మూలాలు ఇచ్చారన్నారు. హవాలా ఆపరేటర్స్, అంగడియాలు స్టేట్మెంట్స్ ఇచ్చారన్నారు. కవిత ఇచ్చిన 9 ఫోన్లలో డేటా డిలీట్ చేశారని తెలిపారు. ఎందుకు డిలీట్ చేశారంటే కవిత సమాధానం చెప్పలేదన్నారు.కవిత ఫోన్లను పని మనుషులకు ఇచ్చారని పొంతన లేని సమాధానాలు చెపుతున్నారన్నారు. పని మనుషులు డేటా ఎందుకు డిలీట్ చేస్తారని ప్రశ్నించారు. ఫోన్లు ఇవ్వాలని కోరిన వెంటనే డేటా ఫార్మాట్ చేశారని.. సాక్ష్యాలను ధ్వంసం చేశారని, సాక్షులను బెదిరించారని కోర్టుకు ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అనంతరం బెయిల్‌పై తీర్పును ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్ట్ రిజర్వ్ చేసింది.




దిల్లీ: భారత ఎన్నికల ప్రక్రియపై పాశ్చాత్య మీడియా కథనాలను విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఖండించారు. రాజకీయ నేతల్లాగా భావిస్తూ వారు ఈ కామెంట్లు చేస్తున్నారని విమర్శించారు. "మన ఎన్నికల అంశంపై పాశ్చాత్య మీడియా నుంచి నాకు పలు వ్యాఖ్యలు వినిపించాయి. వారు మన ప్రజాస్వామ్యాన్ని విమర్శిస్తున్నది సరైన సమాచారం లేక కాదు. వారు కూడా మన ఎన్నికల్లో రాజకీయ నేతల్లాగానే ఆలోచిస్తూ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు. వేసవిలో ఎండలు మండిపోతుంటే.. ఈ సమయంలో ఎందుకు పోలింగ్ నిర్వహిస్తున్నారని అంటున్నారు. ఇంత వేడిలో కూడా మా అత్యల్ప ఓటింగ్ శాతం.. మీ రికార్డు స్థాయి ఓటింగ్ కంటే ఎక్కువగా ఉంటుందని చెప్పాలనుకుంటున్నా" అని మంత్రి కౌంటర్ ఇచ్చారు. "వారు మన ఈవీఎంలు, ఎన్నికల కమిషన్, చివరకు మన వాతావరణ పరిస్థితులను కూడా ప్రశ్నిస్తారు. వాటన్నింటిని ఎదుర్కొనేందుకు మనం దృఢంగా ఉండాలి" అని వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ ఎన్నికల్లో మరోసారి భాజపాకు అధికారం ఇవ్వాలని, ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి జరిగిందని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన అన్నారు. పదేళ్లకు పూర్వం దేశం పరిస్థితి ఏంటి.. మోదీ అధికార పగ్గాలు చేపట్టాక ఎలా ఉందనే విషయం ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు.



# కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభం.. ఆ నియోజకవర్గాలే టార్గెట్‌గా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రను ప్రారంభించారు. 17 రోజుల పాటు తెలంగాణ లోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో కేసీఆర్ పర్యటించను న్నారు. ఇప్పటికే కరీంనగర్, చేవెళ్ల, మెదక్ బహిరంగ సభల్లో పాల్గొన్న ఆయన రోడ్ షోల ద్వారా ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయను న్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత కేసీఆర్ బస్సుయాత్ర ప్రారంభించారు. కేసీఆర్‌తో బీఆర్ఎస్ నేతలు భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఇక్కడి నుంచి కేసీఆర్ మిర్యాలగూడకు బయలుదేరారు. మొత్తం 17 రోజుల పాటు 12 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కేసీఆర్ రోడ్ షోలు నిర్వహిస్తారు. చివరి రోజైన మే పదో తేదీన సిరిసిల్లలో రోడ్ షో, సిద్ధిపేటలో బహిరంగసభ నిర్వహించడంతో బస్సు యాత్ర ముగుస్తుంది.

**బస్సు యాత్ర ఇలా..** హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, ఆదిలాబాద్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగనుంది. బస్సు యాత్రలో భాగంగా సాయంత్రం సమయంలో రోడ్‌షోలు నిర్వహిస్తారు. ఉదయం రైతుల సమస్యల మీద క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిన పంట పొలాలు, ధాన్యం కల్లాలను సందర్శిస్తూ, రైతులను పరామర్శిస్తూ, వారి కష్టనష్టాలను తెలుసుకుంటారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేసీఆర్ రోడ్ షోలో పాల్గొంటారు.

**17రోజుల పాటు..** కేసీఆర్ 17రోజుల పాటు బస్సు యాత్ర చేయనున్న నేపథ్యంలో ఆయన ప్రయాణించేందుకు వీలుగా బస్సును తీర్చిదిద్దారు. అవసరమైన చోట వినియోగించుకునేందుకు వీలుగా చిన్న బస్సులనూ సిద్ధం చేశారు. యాత్రకు సంబంధించిన పలువురు నేతలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. వారు బస్సు యాత్ర, రోడ్ షోకు సంబంధించిన అన్ని అంశాలను సమన్వయపరచి, పర్యవేక్షించనున్నారు. యాత్ర పొడవునా వంద మందికి పైగా వాలంటీర్లు సేవలు అందించనున్నారు. రక్షణ వ్యవస్థ కోసం బౌన్సర్లనూ ఉపయోగించుకోనున్నారు.

# బీఆర్ఎస్‌ను వీడటంపై కారణాలేంటో చెప్పిన రంజిత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 24: "నేను పార్టీ మారడం కేటీఆర్‌కు ఇష్టం లేదు. కవిత అరెస్ట్ అయిన మూడు రోజులకు కేటీఆర్ కూడా స్టేడియం వెళ్లి మ్యాచ్ చూసాడు" అని చెప్పుకొచ్చారు చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి. బుధవారం మాట్లాడుతూ... అప్పాయింట్మెంట్ అడిగే లీడర్‌కు రిటైర్మెంట్ ఇవ్వాల్సిందే అంటూ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. చేవెళ్ల ప్రజలే తనకు ముఖ్యమన్నారు. నలభై ఏండ్ల నుంచి చేవెళ్ళలోనే ఉన్నానని... తాను చేవెళ్ళకి లోకల్ అని తెలిపారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డితోనే పోటీ అని... చేవెళ్ళలో పోటీ ఇద్దరి మధ్యే అని స్పష్టం చేశారు. కొండా తన ఓటమి ఒప్పుకున్నారని.. ఆయన చెప్పేవన్నీ అబద్ధాలే అని రంజిత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ అంటే గౌరవం ఉందని... కానీ ఆయన అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ తనకు గౌరవం ఇచ్చిందని.. అయితే అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినట్లు వెల్లడించారు. ఐదేండ్లు ఎంపీగా సంతృప్తిగా ఉన్నానన్నారు. పార్టీలకు అతీతంగా తనకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తాను పార్టీ మారుతా అని అనుకోలేదని.. బీఆర్ఎస్‌లో గెలిచే అవకాశం తక్కువ అనిపించి అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులతో కొంత సమస్య ఉండేదని.. కానీ ఇప్పుడు అంతా నార్మల్ అయిందని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.


**ఎన్నికల అఫిడవిట్‌లో ఇలా...** కాగా.. ఎన్నికల అఫిడవిట్‌లో రంజిత్ రెడ్డి పేర్కొన్న వివరాలు మాత్రం చర్చనీయాంశంగా మారాయి.



రంజిత్‌కు రూ.300 కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ సొంత కారు లేదంటూ అఫిడవిట్‌లో ఎంపీ అభ్యర్థి పేర్కొన్నారు. రంజిత్‌రెడ్డి పేరిట రూ.158.81కోట్లు, ఆయన భార్య సీతాదేవి పేరున రూ.135.52 కోట్లు, కుమారుడు రాజార్యన్‌రెడ్డి పేరున రూ.14.17లక్షల విలువ చేసే ఆస్తులున్నాయి. రంజిత్‌రెడ్డి పేరిట రూ.37.83లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సతీమణి పేరున రూ.1.59కోట్ల విలువ చేసే బంగారు/వజ్రాభరణాలున్నాయి.

ఇక ఆయన చేతిలో రూ.1.39లక్షలు, సతీమణి చేతిలో రూ.48,182 నగదు ఉంది. వివిధ బ్యాంకుల్లో రంజిత్‌రెడ్డి పేరిట రూ.20.39కోట్లు, ఆయన భార్య పేరున రూ.2.62కోట్లు అప్పులు ఉన్నాయి. తనపై ఓ క్రిమినల్ కేసు ఉన్నట్టు వెల్లడించారు.

# రుణమాఫీ అమలుపై రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా: హరీశ్‌రావు



సంగారెడ్డి: రుణమాఫీ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అన్ని గ్యారంటీలతో పాటు రుణమాఫీ హామీని ఆగస్టు 15 లోపు నెరవేరుస్తానని సీఎం ప్రమాణం చేయాలని ఆయన సవాల్ విసిరారు. సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. "సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నా. ఇచ్చిన హామీలను అధికార పార్టీ నెరవేర్చేలా చేసే బాధ్యత ప్రతిపక్షంగా మాపై ఉంది. శుక్రవారం అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్తూపం వద్దకు నేను వస్తా. సీఎం రేవంత్ కూడా అక్కడికి వచ్చి ఆగస్టు 15లోపు రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేస్తానని ప్రమాణం చేయాలి. హామీని నిలబెట్టుకుంటే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. మళ్లీ ఉప ఎన్నికలోనూ పోటీ చేయను. మాఫీ చేయకపోతే సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేస్తారా? నాకు పదవి కంటే తెలంగాణ ప్రజల సంక్షేమమే ముఖ్యం. ఆరు గ్యారంటీలను డిసెంబర్ 9న అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఆ మాట తప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే పార్టీ రద్దు చేసుకుంటారా అని తొండి మాటలు మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చి 120 రోజులైంది.. మీ గ్యారంటీలు ఏమయ్యాయి?మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2500, రైతులకు రూ.15,000, నిరుద్యోగులకు భృతి ఎందుకు ఇవ్వలేదు?భారాస అంటే కాంగ్రెస్‌కు ఎందుకంత భయం?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్.. ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ

హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారయ్యింది. ఈనెల 30, మే 3, 4 తేదీలలో మోదీ పర్యటించనున్నారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని వివిధ రంగాల ప్రముఖులతో సమావేశం కానున్నారు. మే 4వ తేదీన నారాయణ పేట్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు.

**రేపు రాష్ట్రంలో పర్యటించనున్న అమిత్ షా :** కాగా పార్లమెంట్ ఎన్నికలపై కమలం పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టింది. తెలంగాణలో బీజేపీ అగ్రనేతలు వరసగా పర్యటించనున్నారు. ఈ క్రమంలో గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా వస్తున్నారు. రేపు మధ్యాహ్నం 12 గంటలకు సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందనరావుకు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. కాగా గురువారం కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు వస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. గురు, శుక్రవారాలు బన్సల్ తెలంగాణలో పర్యటిస్తారని పెద్ద సభలు, సమావేశాల కంటే డోర్ టు డోర్ ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మే నెల




13వ తేదీ వరకు నిర్మాణాత్మకంగా ప్రచారం సాగుతుందని చెప్పారు.

ఎన్నిలకు కేవలం రెండు వారాలు ఉండడంతో బీజేపీ హైకమాండ్ తెలంగాణపై దృష్టి పెట్టింది. వరుసగా పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారానికి మూడు లేదా నాలుగు సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

# 600 రకాల చేపలతో అతి పెద్ద ఆక్వా టన్నెల్



హైదరాబాద్: విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చేశాయ్. వారిని ఆకట్టుకునేందుకు ఆక్వా టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది హైదరాబాద్, రాష్ట్రంలో గల మిగతా ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా ఆక్వా టన్నెల్ ఏర్పాటు చేస్తున్నారు. కూకట్ పల్లి వై జంక్షన్ హుడా ట్రాక్ పార్క్ వద్ద దేశంలో అతిపెద్ద మెరైన్ ఎక్స్ పో నిర్వహిస్తున్నారు. ఇందులో 600 రకాల చేపలు ఉంటాయని నిర్వాహకుడు రాజశేఖర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఇందులో స్కూబా డైవింగ్ కూడా ఉందని వివరించారు. స్కూబా డైవింగ్ గోవా లాంటి ప్రదేశాల్లో ఉండనుంది. ఇప్పుడు హైదరాబాద్ వాసులకు అందుబాటులోకి వచ్చింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660